సాక్షి ప్రకాశం
గురువారం । 22 । మే । 2025



యోగాతో ఆరోగ్యకరమైన జీవితం

యోగాతో ఆరోగ్యకరమైన జీవితం సాకారమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. - 8లో..



మృత్యువులోనూ వీడని స్నేహం

మార్కాపురం మండలం చింతగుంట్ల–కుంట మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి చెందారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35 /26

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

డీలర్ల దయ.. కార్డుదారుల ప్రాప్తం

ఉదయం ఎనిమిది గంటలకే కుయ్... కుయ్... కుయ్... అంటూ రేషన్ బండి వచ్చిందని ప్రజలకు తెలిసేలా సైరన్‌తో వీధుల్లో వెళ్తుంటే నివాసాల్లోని కార్డుదారులు తమ ఇంటికి రేషన్ బండి వచ్చిందని గోతాలు తెచ్చుకుని ఇంటి ముందు పంపిణీ చేసిన బియ్యం, ఇతర సరుకులు తీసుకుని ఇంట్లోకి రెండు అడుగులు వేసేవారు. ఒకవేళ లబ్ధిదారులు లేకపోతే వారికి మళ్లీ వచ్చి ఇచ్చేవారు. ఇక ఈ బండి రాదండి. రేషన్ దుకాణాల వద్దకే వెళ్లి గంటల తరబడి క్యూలో నిలబడి సరుకులు తెచ్చుకోవాల్సిన దుస్థితి కల్పించింది కూటమి ప్రభుత్వం. ఎండీయూ వాహనాలతో ఇంటి ముంగిటకు రేషన్ సరుకులు అందించడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ వాహనాల ద్వారా జీవనోపాధి పొందుతున్న నిరుద్యోగులు రోడ్డున పడనున్నారు.

- ఎండీయూ వాహనాలను నిలిపివేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం
- రేషన్ దుకాణాల వద్ద కష్టాలు ప్రారంభం
- ఇంటింటికి రేషన్ పంపిణీ నిలిచిపోవడంతో ప్రజలకు అవస్థలు
- రోడ్డున పడనున్న 385 మంది వాహన ఆపరేటర్లు
- ఎన్‌ఓసీ ఇప్పించకపోతే న్యాయపోరాటం తప్పదంటున్న వాహన ఆపరేటర్లు

బేస్తవారిపేట/కంభం

కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పుణ్యమా అని పేదలకు రేషన్ షాపులకెళ్లి సరుకులు తెచ్చుకునే కష్టాలు మళ్లీ ప్రారంభం కానున్నాయి. 2019 ముందు రోజులు పునరావృతం కానున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ డీలర్లను బలవంతంగా తొలగించి కూటమి నాయకులకు కట్టబెట్టింది. రేషన్ బియ్యాన్ని ఒక పథకం ప్రకారం దొడ్డిదారిన మళ్లించేందుకు పెద్ద కుట్రే జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,392 రేషన్ షాపులు ఉన్నాయి. అంత్యోదయ అన్న యోజన కార్డులు 32,807, తెల్లకార్డులు 6,37,820 చొప్పున మొత్తం 6,70,627 కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు 385 ఎండీయూ వాహనాలు, రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా 9,500 మెట్రిక్ టన్నుల బియ్యం, 351 మెట్రిక్ టన్నుల చక్కెర, 670 మెట్రిక్ టన్నుల కందిపప్పు పంపిణీ చేస్తున్నారు.



ఎండీయూ ద్వారా ముంగిట్లోకే..

సరుకుల కోసం రేషన్ దుకాణాల దాకా వెళ్లలేని పేదలు పడుతున్న అవస్థలు గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని అందుబాటులోకి తెచ్చారు. ప్రతి ఎండీయూ వాహనం ద్వారా వెయ్యి నుంచి 2 వేల కార్డులకు రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి నెలా 1 నుంచి 17వ తేదీ వరకూ వాహనాలు ఇంటింటికీ తిరిగి రేషన్ అందిస్తూ వచ్చాయి. ఇంటి వద్దే బియ్యం పంపిణీ చేసే వ్యవస్థకు కూటమి ప్రభుత్వం మంగళం పలికింది. దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న దీనిని నిలిపివేస్తూ జిల్లాలో లక్షలాది మంది ప్రజలను కష్టాలకు గురి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. 2019కి ముందు రేషన్ షాపుల వద్ద నుంచి సరుకులు తెచ్చుకోవడం లబ్ధిదారులకు ప్రహసనంగా ఉండేది. దుకాణాల్లో 50 నుంచి 60 శాతం మంది లబ్ధిదారులు మాత్రమే సరుకులు తీసుకునేవారు. అక్రమాలు ఎక్కువగా జరిగేవి. ఎండీయూ ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయడం ద్వారా 95 శాతం మంది కార్డుదారులకు సరుకులు తేలిగ్గా లభించాయి. కూటమి ప్రభుత్వం వీటికి మంగళం పలుకుతుండటంతో ప్రజలు అవస్థ పడాల్సిందే. వాహనాలు తొలగించడంతో రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులకు కష్టాలు పునరావృతం కానున్నాయి.

రేషన్ షాపులు	ఎండీయూ వాహనాలు
1392	385

రేషన్ కార్డులు 6,70,627

రోడ్డున పడనున్న ఆపరేటర్లు...

72 నెలల అగ్రిమెంట్ కాలంతో విధుల్లో చేరిన ఎండీయూ ఆపరేటర్లకు ఇంకా ఒకటిన్నర సంవత్సరం ఉంది. 2027 జనవరి వరకూ అగ్రిమెంట్ ఉన్నా ప్రభుత్వం తొలగించడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 385 మంది ఎండీయూ ఆపరేటర్లు రోడ్డున పడుతున్నారు. గత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టగా కేవలం 385 మంది ఆపరేటర్లు ఒక్కొక్కరు 4 షాపుల చొప్పున ప్రజలకు రేషన్ అందిస్తూ వచ్చారు. వృద్ధులు, వికలాంగులు, డయాలసిస్ పేషంట్లకు ఇంటి వద్దకే రేషన్ వస్తుండటంతో వారికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ప్రజల ఇంటి వద్దకే రేషన్ సరుకులు చేరవేస్తున్నందుకుగానూ ప్రభుత్వం నెలకు రూ.18 వేల జీతం అందిస్తుండగా అందులో పెట్రోల్‌కు రూ.4 వేలు, హెల్పర్‌కు రూ.5 వేలు ఖర్చవుతుండగా వారికి రూ.9 వేలు మిగిలేవి. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారంతా జీవనోపాధి కోల్పోవాల్సి వస్తోంది. ఈ పనినే నమ్ముకుని ఐదేళ్లుగా జీవనం సాగిస్తున్న ఆపరేటర్లు కూటమి ప్రభుత్వ నిర్ణయంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఒకటిన్నర సంవత్సరం అగ్రిమెంట్ కాలం ఉండగా తొలగించడం అన్యాయమని, బ్యాంకుల వద్ద తమ వాహనాలకు ఉన్న బకాయిలను వెంటనే చెల్లించి ఎండీయూ ఆపరేటర్లందరికీ రెండు మూడు రోజుల్లో ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు అందజేసిన తర్వాతే డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

న్యాయపోరాటానికి సిద్ధం...



అగ్రిమెంట్ కాలం ఉండగానే మమ్మల్ని తొలగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అన్యాయం. మా వాహనాలకు సంబంధించి బ్యాంక్ ఆఫ్ బరోడాలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. ఎన్‌ఓసీ ఇప్పించాలి. న్యాయం చేయకుండా జూన్ ఒకటి నుంచి రేషన్ షాపుల ద్వారా బియ్యం సరఫరా చేస్తే న్యాయపోరాటానికి సిద్ధం.

– కొప్పుల అరవింద్, జిల్లా ప్రెసిడెంట్, ఎండీయూ ఆపరేటర్ల సంఘం

ఉపాధి కోల్పోయా



వచ్చే కొద్దిపాటి జీతంతో కుటుంబాన్ని పోషించుకునే వాడిని. గత ఐదేళ్లుగా దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నాను. ఒక్కసారిగా తొలగించడం అన్యాయం. ఉపాధి కోల్పోయిన ఆపరేటర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలి.

– అనిల్, ఎండీయూ ఆపరేటర్, కంభం మండల



బేస్తవారిపేటతహసీల్దార్ కార్యాలయంలో నిరుపయోగంగా ఎండీయూ వాహనం

న్యూస్‌రీల్

శివకేశవ ఆలయాల మధ్య అడ్డుగోడ

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు, గ్రామస్తులు



శివకేశవ ఆలయాల మధ్య వివాదంగా మారిన ప్రహరీ

పొన్నలూరు: స్థానిక శివాలయం, చెన్నకేశవ ఆలయాల మధ్య కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్రహరీ నిర్మాణం వివాదానికి దారితీస్తోంది. రెండు ఆలయాల మధ్య శాస్త్ర విరుద్ధంగా కొందరు కావాలనే గోడను నిర్మించడంపై భక్తులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొన్నలూరు గ్రామంలో దశాబ్ద కాలం నుంచి దక్షిణముఖ శివాలయం, చెన్నకేశవ ఆలయాలు ఉండటం చాలా అరుదుగా చెప్పుకుంటారు. ఈ రెండు దేవాలయాల్లో భక్తులు పూజలు చేస్తుంటారు. శివాలయం దేవాదాయ శాఖ ఆధీనంలో ఉండగా, చెన్నకేశవ స్వామి ఆలయ నిర్వాహణ బాధ్యతలను ధర్మకర్తలు చూస్తున్నారు. అయితే శాస్త్ర విరుద్ధంగా మూడు రోజుల క్రితం రెండు ఆలయాల మధ్య ప్రహరీ నిర్మించడం పట్ల భక్తులు, గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు, దేవాదాయ శాఖ అధికారులకు తెలియకుండా చెన్నకేశస్వామి ఆలయ ధర్మకర్తలే ఈ పనికి పూనుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శివాలయం వెనుక వైపు కనీసం భక్తులు ప్రదక్షణలు చేయడానికి కూడా వీలు లేకుండా గోడ నిర్మించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ ఈఏపీసెట్‌కు 2271 మంది హాజరు

ఒంగోలు సిటీ: జేఎన్‌టీయూ కాకినాడలో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీసెట్ పరీక్ష ప్రశాంతంగా ప్రారంభమైంది. ఈ నెల 27వ తేదీ వరకు పరీక్ష జరగనుంది. జిల్లాలో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకు సంబంధించి మొత్తం 2357 మందికి గాను 2271 మంది హాజరయ్యారు. 96.35 శాతం మంది ప్రవేశపరీక్షకు హాజరయ్యారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

టంగుటూరు: హౌసింగ్ లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు ప్రతి ఒక్కరూ వెంటనే ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని జమ్ములపాలెం హౌసింగ్ లే అవుట్‌ని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ హౌసింగ్ లే అవుట్‌లో ఎన్ని ప్లాట్లు ఇచ్చారు, ఎంత మంది నిర్మాణాలు చేపట్టారని వివరాలు అడిగి తీసుకున్నారు. ఇళ్ల పట్టాల లబ్ధిదారుల రీ వెరిఫికేషన్ చేసి అర్హులను గుర్తించాలన్నారు. అర్హులంతా త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ హనుమంతరావు, వీఆర్‌ఓ లక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శరత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

నేర నియంత్రణ లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్



హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది

- శాంతి భద్రతల పరిరక్షణకు సాంకేతికతను అందిపుచ్చుకోండి
- పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించండి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్

కనిగిరిరూరల్: నేరాల నియంత్రణకు సాంకేతికతను ఉపయోగించుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో సాంకేతికత పాత్ర కీలకమన్నారు. స్థానిక పవిత్ర కల్యాణ మండపంలో బుధవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ లక్ష్యంగా పనిచేయాలన్నారు. పెండింగ్ కేసులను తగ్గించేందుకు అన్నిస్థాయిలోని అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపర చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. డ్రోన్, సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానంతో నేర పరిశోధన వేగవంతం చేయాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్‌టీజింగ్, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ఏరియాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాలు, ఇతర నేరాలు జరిగే ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాలను ముందుగానే గుర్తించి ఆ ప్రాంతాలకు డ్రోన్లు పంపి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్య ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగించాలని సూచించారు.

కేసుల పురోగతిపై సమీక్ష..

ఈ సందర్భంగా హత్య కేసులు, లైంగిక దాడులు, మిస్సింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, పెండింగ్ కేసులపై ఎస్పీ సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా కేసుల పరోగతిపై సమీక్షించారు. జైలు నుంచి విడుదలైన పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, చెడు నడత కల్గిన వ్యక్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి సమీక్షించారు. ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు.

ప్రతిభ కనబర్చిన అధికారులకు అభినందన

ఈ నెల 12న కొండపి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసును త్వరగా ఛేదించి రూ.15 లక్షల విలువైన సొత్తును రికవరీ చేయడంలో ప్రతిభ కనబర్చిన సీఐ, ఎస్సై, పోలీస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలను, రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అత్యాధునిక సాంకేతికత కల్గిన డ్రోన్ కెమెరాలను ఎస్పీకి అందచేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరావు, డీఎస్పీలు ఆర్ శ్రీనివాసరావు, లక్ష్మీ నారాయణ, సాయి ఈశ్వర్ యశ్వంత్, రమణ కుమార్, డీసీఆర్‌బీ సీఐ దేవప్రభాకర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అరాచక పాలన

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దొనకొండ: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. దొనకొండ మండలం పోలేపల్లిలో పోలేరమ్మ తిరుణాళ్ల సందర్భంగా మంగళవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఎప్పటికప్పుడు మాట మారుస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. హామీలు అమలు చేయకుండా ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సంక్షేమ పథకాలను గాలికొదిలేశారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలకూ అతీగతి లేదన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ స్థాయి నుంచే అక్రమాలకు పాల్పడుతూ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. ఇలాంటి దౌర్భాగ్య ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో మరలా రాజన్న రాజ్యం రావాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యకర్తలే పార్టీకి బలమని, జెండా మోసిన వారికే గుర్తింపు ఉంటుందని, అలాంటి వారిని మన జగనన్న ఎప్పుడూ మరిచిపోరని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కాకర్ల క్రిష్టారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, సర్పంచ్ యద్దనపూడి జాన్‌ప్రకాష్, సెక్రటరీ బత్తుల వెంకటసుబ్బయ్య యాదవ్, ఎంపీటీసీ బందారు రాజు, ఆదిసుబ్బారావు, గొంగటి మహేష్‌రెడ్డి, కర్నూలు రామిరెడ్డి, కంభంపాటి రామిరెడ్డి, రామిరెడ్డి సుబ్బారెడ్డి, ఎం భూషయ్య, మంగయ్య, కాటమరాజు, వెంకటేశ్వర్లు, బెజవాడ యిర్మియా, దేవండ్ల వెంకటసుబ్బయ్య, పెసల శ్రీకాంత్‌రెడ్డి, పెసల చిన్ననారాయణరెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

క్రమశిక్షణ పాటించకుంటే కఠిన చర్యలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- కొప్పోలు వార్డు సచివాలయం ఆకస్మిక తనిఖీ

ఒంగోలు సబర్బన్: సచివాలయ సిబ్బంది క్రమశిక్షణ పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. ఒంగోలు శివారులోని కొప్పోలు వార్డు సచివాలయాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా స్థానికులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రీసర్వే డేటాను పరిశీలించారు. ఆధార్ కార్డ్ లేని చిన్నారులు సచివాలయం పరిధిలో ఎంత మంది ఉన్నారు...వారికి ఆధార్ కార్డులు అందేలా ఎలాంటి చర్యలు తీసుకున్నారని మహిళా సంరక్షణ కార్యదర్శిని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది వేస్తున్న బయోమెట్రిక్ హాజరు వివరాలను పరిశీలించారు. కొందరు సిబ్బంది 11 గంటలకు వచ్చినట్లు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన, సేవల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సచివాలయ పరిధిలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్నతో కలిసి నగరంలో ఇంటి పట్టాలకు సంబంధించి రీ వెరిఫికేషన్ చేశారు. ఇంటి నివేశన పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఆధార్ కార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఒంగోలు అర్బన్ తహసీల్దార్ పిన్నిక మధుసూదన్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఉన్నారు.



సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ప్రభుత్వరంగ సంస్థలను రంగంలోకి దింపాలి

- నిత్యం వందలాది బేళ్లను తిరస్కరిస్తే ఎలా..?
- లో గ్రేడ్ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలి
- వేలం కేంద్రాలను పరిశీలించిన రైతు సంఘం ప్రతినిధులు

ఒంగోలు సిటీ: పొగాకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ రంగ సంస్థలను వెంటనే రంగంలోకి దింపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఒంగోలు పరిధిలోని పేర్నమిట్ట, త్రోవగుంట వేలం కేంద్రాలను బుధవారం సంఘం బృందం పరిశీలించారు. రెండు వేలం కేంద్రాల్లో వేలంలో పాల్గొన్న బయ్యర్లు ఏ ఒక్కరూ కూడా లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయకపోవడంపై రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జుజ్జూరి జయంతిబాబు, పమిడి వెంకటరావు, ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు ఆక్షేపణ వ్యక్తం చేశారు. రైతులు తీసుకువస్తున్న బేళ్లలో 50 శాతం బేళ్లు తిరస్కరిస్తే రైతులకు ఎంత నష్టం కలుగుతుందో తెలుసా అని నిర్వాహకులను ప్రశ్నించారు. కనిష్ట ధర రూ.200 తగ్గించడం దారుణమన్నారు. గత ఏడాది రూ.360 చొప్పున కొనుగోలు చేసిన కంపెనీలు ఈ ఏడాది ఎందుకు కొనుగోలు చేయడం లేదని కంపెనీ ప్రతినిధులను, వేలం నిర్వహణాధికారి జె.తులసిని ప్రశ్నించారు. 160 మిలియన్ కిలోల పొగాకుకు బోర్డు అనుమతించిందని, కానీ ఇప్పటి వరకు కొనుగోలు చేసింది చాలా స్వల్పమన్నారు. కంపెనీలకు విదేశీ ఆర్డర్లు రానందున కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని, ఈ నెలాఖరుకు విదేశీ ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందని కంపెనీలు చెబుతున్నాయని నిర్వహణాధికారి తులసి పేర్కొన్నారు. కంపెనీల యాజమాన్యం సూచనల మేరకు లో గ్రేడ్ కొనుగోలు చేయడం లేదని బయ్యర్ల ప్రతినిధులు పేర్కొన్నారు. మార్కెట్ ఇదే రీతిలో కొనసాగితే 90 శాతం మంది రైతులకు బ్యారన్‌కు రూ.4 నుంచి రూ.5 లక్షల వరకు నష్టపోతారని తెలిపారు. వేలం ప్రారంభంలో రూ.240 ఉన్న కనిష్ట ధర పది రోజుల్లోనే రూ.200 పడిపోవడం వెనుక బయ్యర్ల సిండికేట్ అయినట్లు తెలుస్తుందన్నారు. రైతు సంఘ నేతలు బెజవాడ శ్రీనివాసరావు, కరిచేటి హనుమంతరావు, కిలారి పెద్దబ్బాయి, సుబ్బారావు పాల్గొన్నారు.



పొగాకు వేలం కేంద్రాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

పిల్లలం.. కాలువ ఈదేస్తాం..



జేబీకే పురం వద్ద కంభం చెరువు కాలువ నీటిలో ఈదుతున్న చిన్నారులు

వేసవి సెలవులంటేనే పిల్లలు ఎగిరి గంతేస్తారు. అదే ఉత్సాహాన్ని రెండింతలు చేసి, దేహ దారుఢ్యాన్ని పెంచుకోవాలంటే మాత్రం తప్పనిసరిగా ఈత కొట్టాల్సిందే.! గతంలో పల్లెటూర్లు, పట్టణ శివార్లలో అక్కడక్కడా బావులు ఉండేవి. కాలక్రమంలో పల్లెటూర్లలోని 80 శాతం బావులు పూడ్చేసిన పరిస్థితి. పట్టణ ప్రాంతాల్లో చిన్నారులు స్విమ్మింగ్ పూల్స్‌ను ఆశ్రయిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు వేసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు. పల్లెటూర్లలో చెరువులు, కుంటలు ఈతకు యోగ్యంగా లేకపోవడంతో పిల్ల కాలువల్లో ఈదుతూ చిన్నారులు సరదా తీర్చుకుంటున్నారు.

\- బేస్తవారిపేట

కేబినెట్ మీటింగ్‌లు కావ్‌లే..!





బేస్తవారిపేటలో భవనాలపై గుమిగూడిన కాకులు

కాకులు వరుసగా అత్యవసర సమావేశాలు నిర్వహిస్తున్నాయ్..! మరి కాకులంటే మాటలా. లోకులతో పాటు తామూ తెలివైనవాళ్లమే అని వాటి ఫీలింగ్. నిజమే.. కాకులు ఆరేడేళ్ల పిల్లలతో సమానంగా ఐక్యూ కలిగి ఉంటాయని ఆర్నిథాలజిస్ట్‌లూ తేల్చారు. అంతకంటే ముందే.. కాకుల ప్రవర్తనను బట్టి భవిష్యత్‌ను అంచనా వేస్తూ ఏకంగా కాకి శాస్త్రమే రూపొందించారు మన పూర్వీకులు. ఇంతకీ విషయమేమిటంటే బేస్తవారిపేటలోని ఓ భవంతిపై వందలాది కాకులు తరచూ సమావేశమై వాటి భాషలో చర్చలు జరుపుతున్నాయ్. సాధారణంగా ఇవి గుంపు గూడాయంటే ఏదో జరగబోతోంది! ఎవరికో మూడింది! అని ఓ అంచనాకు వచ్చేయడం పరిపాటి. వాస్తవానికి ఆహారాన్ని సంపాదించుకోవడం, ముప్పును ఎదుర్కోవడంపై సంభాషించుకునేందుకు అవి ఇలా సమావేశమవుతాయట..!

\- బేస్తవారిపేట

కష్టం @ కవళం



చేనుగట్టున భోజనం చేస్తున్న కూలీలు

రెక్కల కష్టం చేసేది ఆకలి తీర్చే ఆ నాలుగు మెతుకుల కోసమే. జానపదాలు, అలనాటి సినీ గీతాలు ఆలపిస్తూ పనిచేసిన మహిళలు.. సూరీడు నడినెత్తికి రాగానే కాస్త విశ్రమించారు. కష్టాన్ని మరిచి, చమత్కారమాడుతూ.. సామెతలు చెబుతూ భోజనం చేశారు. కొనకనమిట్ల మండలంలో పాతపాడు గ్రామ సమీప పొలాల్లో మిరప కోతకు వచ్చిన కూలీలు.. విరామ సమయంలో ఇలా ముచ్చట్లాడుతూ కనిపించారు.

\- కొనకనమిట్ల

క్లుప్తంగా

టెన్త్ సప్లి ఇంగ్లిష్‌కు 251 మంది గైర్హాజరు

ఒంగోలు సిటీ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. మూడో రోజు బుధవారం జిల్లాలోని 36 కేంద్రాల్లో ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించారు. 619 మంది విద్యార్థులకుగాను 251 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్ కెమిస్ట్రీ పరీక్షకు మొత్తం 1097 మంది విద్యార్థులకుగాను 168 మంది, ఎకనామిక్స్ పరీక్షకు 510 మందికిగాను 81 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ టెన్త్ తెలుగు పరీక్షకు 704 మందికిగాను 153 మంది గైర్హాజరుకాగా ఉర్దూ పరీక్షకు ఇద్దరు విద్యార్థులకుగాను ఇద్దరూ హాజరయ్యారు. కాగా, 15 పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు డీఈఓ కిరణ్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో జ్యూస్ షాపు దగ్ధం



మంటల్లో కాలిపోయిన ఫ్రిజ్

పెద్దారవీడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో జ్యూస్ షాప్ దగ్ధమైంది. ఈ సంఘటన బుధవారం పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టులో బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. దుకాణంలోని రెండు ఫ్రిజ్‌లు, వివిధ రకాల పండ్లు, బంకు పూర్తిగా దగ్ధం కావడంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని యజమాని చాంద్‌బాషా తెలిపారు. స్థానికులు స్పందించి నీరు చల్లి మంటలు అదుపు చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

పశ్చిమాన మోస్తరు వర్షం



చిన్నదోర్నాల వద్ద పొంగి ప్రవహిస్తున్న తీగలేరు

- చిన్నదోర్నాల వద్ద పొంగిపొర్లిన తీగలేరు
- వాహనాల రాకపోకలకు అంతరాయం
- కనిగిరిలో ఉరుములు, మెరుపులతో వాన
- ఈదురుగాలుల ధాటికి నిలిచిన విద్యుత్ సరఫరా
- ఖరీఫ్ సాగుకు సేద్యాలు ప్రారంభించిన రైతులు

మార్కాపురం/పెద్దదోర్నాల/కనిగిరి: పశ్చిమ ప్రకాశంలోని పలు మండలాల్లో బుధవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దోర్నాల మండలంలో 10.2 మి.మీ, గిద్దలూరు 4.2 మి.మీ, పొదిలి 3.6 మి.మీ, రాచర్ల 3.6 మి.మీ, దొనకొండ 3.4 మి.మీ, కొనకనమిట్ల 3.0 మి.మీ, కంభం మండలంలో 2.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మార్కాపురం, త్రిపురాంతకం, తర్లుపాడు, అర్ధవీడు, పుల్లలచెరువు, యర్రగొండపాలెం తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి.



పట్టణంలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

పొంగిపొర్లిన తీగలేరు

పెద్దదోర్నాల మండల కేంద్రంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. లోతట్టు వీధులు జలమయంగా మారాయి. వర్ష ప్రభావంలో శ్రీశైలం రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయ పరిసర ప్రాంతాలు నీటి మడుగులను తలపించాయి. చిన్నదోర్నాల వద్ద తీగలేరు పొంగిపొర్లడంతో మార్కాపురం–దోర్నాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కనిగిరిలో జోరువాన

కనిగిరి ప్రాంతంలో బుధవారం రాత్రి 8 గంటల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కనిగిరి ప్రధాన వీధుల్లో డ్రెయినేజీలు పొంగిపొర్లడంతో అస్తవ్యస్తంగా మారాయి. ఈదురుగాలుల ధాటికి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



మార్కాపురం ప్రాంతంలో దుక్కి దున్నుతున్న రైతు

గత ఐదు రోజులుగా జిల్లాలో చెదురు ముదురు జల్లులతోపాటు భారీ వర్షాలు కురవడంతో పదునెక్కిన పొలాల్లో రైతులు సేద్యాలు ప్రారంభించారు. మార్కాపురం మండలంలోని వేములకోట, దరిమడుగు, గజ్జలకొండ, రాయవరం, నాయుడుపల్లి, మన్నెంవారిపల్లి, బోడపాడు పెద్దనాగులవరం, జమ్మనపల్లి, కోలభీమునిపాడు, చింతగుంట్ల, తిప్పాయపాలెం, ఎల్‌బీయస్ నగర్ తదితర గ్రామాల్లో వేసవి దక్కులు ప్రారంభమయ్యాయి. నైరుతి రుతుపవనాలు కూడా ముందుగానే వస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో సాగుకు సిద్ధమవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. తొలకరి వర్షాలు పడిన వెంటనే సజ్జ, కంది, ఆముదం, వేసవి పత్తి సాగు చేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు.

వైపాలెం టీడీపీలో లుకలుకలు!

- మినీ మహానాడుకు మన్నె రవీంద్ర వర్గం దూరం
- మరో మినీ మహానాడుకు ఏర్పాట్లు

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం టీడీపీ ముఖ్య నేతల మధ్య వర్గవిభేదాలు మినీ మహానాడు సాక్షిగా మరోమారు బహిర్గతమయ్యాయి. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి సమీపంలో ఉన్న టీడీపీ కార్యాలయంలో బుధవారం మినీ మహానాడు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నేత, రాష్ట్ర టెక్నాలజీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర వర్గం దూరంగా ఉంది. ఎరిక్షన్‌బాబు, మన్నె రవీంద్ర మధ్య దాదాపు ఏడాది క్రితం నుంచే విభేదాలు ఉన్నాయి. పార్టీ ఆదేశించిన కార్యక్రమాలకు ఎరిక్షన్‌బాబు తన ప్రత్యర్థి వర్గానికి ఆహ్వానం పంపకుండా దూరంగా ఉంచుతున్నట్లు స్థానికంగా చర్చ నడుస్తోంది. అదే సమయంలో మన్నె వర్గీయులు పోటీగా అదే తరహా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఎరిక్షన్‌బాబు కనుసన్నల్లో వైపాలెం నియోజకవర్గంలో సాగిస్తున్న అవినీతి, అక్రమాలను ఎప్పటికప్పుడు పార్టీ పెద్దలకు చేరవేస్తున్నప్పటికీ వారి నుంచి సరైన స్పందన లేదని మన్నె వర్గీయులు లోలోన రగిలిపోతున్న పరిస్థితి. వైఎస్సార్ కడప జిల్లాలో నిర్వహించనున్న మహానాడు అనంతరం పార్టీని ప్రక్షాళన చేసే అవకాశం ఉందని టీడీపీ నేతలు బాహాటంగానే చెబుతుండటం గమనార్హం. ఇదిలా ఉండగా మన్నె రవీంద్ర వర్గం ఈ నెల 25న వైపాలెంలో మరో మినీ మహానాడు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

ఎస్పీకి డ్రోన్ కెమెరా అందజేత



ఎస్పీ దామోదర్‌కు డ్రోన్ కెమెరా అందిస్తున్న రామాంజనేయరెడ్డి

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ వింగ్ అధికార ప్రతినిధి బిక్కా రామాంజనేయరెడ్డి బుధవారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు డ్రోన్ కెమెరా అందజేశారు. కనిగిరిలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో రూ.1.58 లక్షల విలువైన డ్రోన్ అందించారు. 'బిక్కా' తమ స్వగ్రామమైన బేస్తవారిపేట మండలంలోని సలకలవీడులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. యువకుడు మృతి

- మరో ఇద్దరికి స్వల్ప గాయాలు



రాజేష్(ఫైల్)

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడటంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం ఉదయం పాకల శివాలయం సమీపంలోని కోనేరు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాకల పల్లెపాలేనికి చెందిన స్నేహితులు రేవు రాజేష్(21), కొక్కిలిగడ్డ కిరణ్, సైకం సంతోష్ ఆటోలో వెళ్తున్నారు. ఆటో శివాలయం సమీపంలోని కోనేరు వద్దకు రాగానే అదుపుతప్పి ప్రమాదవశాత్తు తిరగబడింది. ప్రమాదంలో రాజేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో సింగరాయకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. మృతుడు రాజేష్ పాలిటెక్నిక్ చదువుతున్నాడు. చేతికందివచ్చిన ఒక్కగానొక్క కుమారుడిని మృత్యువు కబళించడంతో తల్లిదండ్రులు రేవు నాగేంద్రం, కృష్ణమ్మలు బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం



సంఘటన స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న జంకె వెంకటరెడ్డి



మృతదేహాలను పరిశీలిస్తున్న కృష్ణచైతన్య, స్థానికులు

- స్కూటర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ఇద్దరు దుర్మరణం
- కారు డ్రైవర్ అతి వేగమే ప్రమాదానికి కారణం
- మార్కాపురం మండలం చింతగుంట్ల వద్ద దుర్ఘటన
- బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే జంకె, అన్నా కృష్ణచైతన్య పరామర్శ

మార్కాపురం: అతి వేగం.. నిర్లక్ష్యం.. రెండు నిండు ప్రాణాలను బలిగొన్నది. మార్కాపురం మండలం చింతగుంట్ల–కుంట మధ్య బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు అక్కడికక్కడే మృతి చెందారు. తమ బంధువు మృతి చెందడంతో కడచూపు చూసేందుకు వారు కూడా మృత్యు ఒడిలోకి చేరారు. దీంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. మార్కాపురం మండలం వేములకోట పంచాయితీలోని వేములపేట గ్రామానికి చెందిన జంకె శ్రీనివాసరెడ్డి(53), తన బంధువు, స్నేహితుడైన కొండేపల్లి గ్రామానికి చెందిన చాగంటి గాలిరెడ్డి(63) బుధవారం ఉదయం పెద్దారవీడు మండలం సానికవరం గ్రామంలో మృతి చెందిన బంధువును చూసేందుకు స్కూటర్‌పై బయలుదేరారు. చింతగుంట్ల గ్రామ సమీపంలో హైవే రోడ్డు ఎక్కి కొద్ది దూరం వెళ్లగా.. రాచర్ల నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి ఢీట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరెడ్డి, గాలిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మార్కాపురం రూరల్ ఏఎస్సైలు శ్రీనివాసరావు, రంగయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సంఘటనా స్థలం నుంచి పరారై పోలీసుస్టేషన్‌లో లొంగిపోయాడు.



జంకె శ్రీనివాసరెడ్డి(ఫైల్)

స్నేహ బంధం.. విషాదాంతం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరికీ చిరకాల స్నేహంతో పాటు బంధుత్వం కూడా ఉంది. మృతుడు జంకె శ్రీనివాసరెడ్డికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమారుడు కృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి 100 మీటర్ల దూరంలో ఉన్న సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తె రమణమ్మకు వివాహమైంది. మరో కుమారుడు కాశిరెడ్డి 6వ తరగతి, కుమార్తె వెంకట కాశీశ్వరి 8వ తరగతి చదువుతున్నారు. మరో మృతుడు చాగంటి గాలిరెడ్డికి భార్య మంగమ్మతోపాటు కుమారులు రామాంజనేయరెడ్డి, రామిరెడ్డి ఉన్నారు. శ్రీనివాసరెడ్డి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. వేములకోట, వేములపేట, కొట్టాలపల్లి, నికరంపల్లి గ్రామాలకు చెందిన పలువురు సంఘటనా స్థలంతోపాటు జీజీహెచ్‌కు తరలివచ్చారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

ప్రమాద సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నెల్లూరు జిల్లా పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మార్కాపురం వైఎస్సార్ సీపీ నాయకుడు అన్నా కృష్ణ చైతన్య హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

గ్యాస్ లీకై.. మంటలు చెలరేగి..

- ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న సంతోష్ కుమార్

మార్కాపురం టౌన్: గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో ఒకరికి గాయాలైన సంఘటన బుధవారం పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో బీహార్‌కు చెందిన సంతోష్‌కుమార్ పాశ్వాన్ బుధవారం వంట మాస్టర్‌గా పనిచేసేందుకు వచ్చాడు. గ్యాస్ స్టవ్ ఆన్ చేసిన కొంత సమయం తర్వాత లైటర్‌తో వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గాయపడిన సంతోష్‌కుమార్‌ను జీజీహెచ్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఆపద ప్రబంధన్'కు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సబర్బన్: భారత ప్రభుత్వం ఏటా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని అందిస్తున్న ఆపద ప్రబంధన్ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్వో ఓబులేసు బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. విపత్తుల నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన వారికి జనవరి 23వ తేదీన నేతాజీ జయంతి సందర్భంగా అవార్డు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఈ పురస్కారానికి అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలు ఈ నెల 30వ తేదీ లోగా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



యోగా సాధన చేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు

యోగాతో ఆరోగ్యకరమైన జీవితం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ యోగా సాధన చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సాకారమవుతుందని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహక ఏర్పాట్లలో భాగంగా బుధవారం ఉదయం ఒంగోలులోని కేంద్రియ విద్యాలయంలో నిర్వహించిన మెగా యోగా సాధనలో కలెక్టర్‌తోపాటు ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, ఒంగోలు మేయర్ సుజాత, ఏపీ పర్యటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 21వ తేదీన నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖకు వస్తున్న సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ యోగేంద్ర కార్యక్రమాన్ని నెల రోజులపాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో యోగా సాధనపై అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. రానున్న నెల రోజులపాటు ప్రణాళిక ప్రకారం జిల్లాలోని ప్రతి గ్రామంలో యోగా సాధన చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యోగా గురువు పతంజలి బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులు, యోగా సాధకులు, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆయుష్ శాఖ ఆర్డీడీ పద్మజాతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.